క్లుప్తంగా

హుండీ లెక్కింపు

చిక్కడపల్లి: ప్రసిద్ధిగాంచిన చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం హుండీ లెక్కించారు. ఈ సందర్భంగా దేవాలయం ఈఓ ఎం.దేవనాథం మాట్లాడుతూ.. 31 రోజులకు హుండీ ఆదాయం లెక్కించగా రూ.2,16,632లు వచ్చాయన్నారు. ప్రతి మంగళ, శనివారాల్లో అన్న ప్రసాద వితరణ నిరంతరం కొనసాగిస్తున్నామన్నారు. దేవాలయం రెనివేషన్ కమిటీ చైర్మన్ బాసాని పద్మ సూర్యప్రకాష్, డాక్టర్ జీ.కే.రమణ, కె.కృష్ణమూర్తి, అర్చకులు బుగ్గాలక్ష్మీపతిశర్మ, ఆచారి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జిల్లా సబ్ జూనియర్ నెట్‌బాల్ టోర్నమెంట్



జట్టుతో కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మయ్య

కాచిగూడ: అంతర్ జిల్లా సబ్ జూనియర్ నెట్‌బాల్ టోర్నమెంట్ నేడు మేడ్చల్‌లో జరుగుతుందని కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మయ్య, హైదరాబాద్ జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి ఎం.విష్ణుష్ ప్రకటించారు. హైదరాబాద్ జిల్లా నుంచి సబ్ జూనియర్ నెట్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపికైన బాలబాలికలను శుక్రవారం కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వారు అభినందించారు. హైదరాబాద్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి



భూమన్నలేన్‌లో కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్

కాచిగూడ: డ్రైనేజీ సమస్యతో ప్రజలు రోజూ ఇబ్బందులు పడుతుండటంతో ఆ సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆమె శుక్రవారం జలమండలి అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి ఎయిర్‌టెక్ మిషన్‌ను తెప్పించి డ్రైనేజీ సమస్యను పరిష్కరింపజేశారు. ప్రజా సమస్యలను పరిష్కారంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. సుభాష్ పటేల్, ఎస్.రవియాదవ్, బీమ్‌రాజ్, ఆర్.సంతోష్, వాసు, ప్రతిభ, తదితరులున్నారు.

ముగిసిన నవరాత్రి మహోత్సవాలు



చిక్కడపల్లి: ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని లక్ష్మీగణపతి ఆలయంలో వినాయకచవితి సందర్భంగా జరుగుతున్న నవరాత్రి మహోత్సవాలు ముగిశాయి. చివరిరోజైన శుక్రవారం పూర్ణాహుతి కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, ఈఓ లక్ష్మారెడ్డి, ఆలయ సభ్యులు రమణమూర్తి, హరిత, స్వరూప, అరుణశ్రీ, రాజా శ్రీనివాస్, అర్చకులు కాశీనాథశర్మ, గోపాలాచార్యులు, బుచ్చమాచార్యులు, జగన్మోహనాచార్యులు, భక్తులు, భక్తబృందం సభ్యులు పాల్గొన్నారు.

రైల్లో వ్యక్తి మృతదేహం లభ్యం

కాచిగూడ: గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైల్లో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప, హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున్ తెలిపిన వివరాల ప్రకారం.. యూపీ గోరఖ్‌పూర్‌కు చెందిన రామ్‌లగన్ మల్హా (60) బెంగుళూర్‌లో పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. స్వస్థలానికి వెళ్లేందుకు గురువారం యశ్వంత్‌పూర్ – గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరగా.. బోగీలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని శుక్రవారం కాచిగూడ రైల్వే స్టేషన్‌లో పోలీసులు స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మరణవార్తను ఫోన్ ద్వారా రైల్వే పోలీసులు కుటుంబ సభ్యులకు తెలియజేశారు.

యాంటీ డ్రగ్ కమిటీ నియామకం

ఉస్మానియా యూనివర్సిటీ: వీసీ ప్రొ.రవిందర్ చైర్మన్‌గా ఆరుగురు సభ్యులతో యాంటీ డ్రగ్ కమిటీని నియమించారు. సభ్యుల్లో ఓయూ సీఐ ఆంజనేయులు, న్యాయకళాశాల ప్రిన్సిపల్ ప్రొ. రాధిక యాదవ్, ఇంజినీరింగ్ కాలేజీ ఈసీఈ విభాగం ద్వితీయ సంవత్సరం విద్యార్థి కె.సాయిచరణ్‌తో పాటు యూత్ వెల్ఫేర్ ఆఫీసర్‌తో పాటు ఉద్యోగ సంఘనేతను నియమించారు.

హెల్త్ కార్డుల పంపిణీ



లబ్ధిదారులకు హెల్త్ కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు

- నియోజకవర్గంలో 90వేల మంది లబ్ధిదారులు
- తొలివిడతలో ఐదువేల మందికి పంపిణీ

నల్లకుంట: తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ట్రస్టు– పీఎంజేఏవై కింద అంబర్‌పేట నియోజకవర్గంలో 90,000ల మందికి హెల్త్ కార్డులను అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. ప్రతి ఏటా కుటుంబ మొత్తానికి ప్రైవేటు, ప్రభుత్వ దవాఖానాల్లో కార్పొరేట్ స్థాయి వైద్యానికి ఉపయోగపడే తెలంగాణ ప్రభుత్వ ఆరోగ్యశ్రీ ట్రస్టు, పీఎంజేఏవై కార్డులను ఉచితంగా తన సొంత ఖర్చులతో అందిస్తున్నామన్నారు. శుక్రవారం సాయంత్రం నల్లకుంట తిలక్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఐదువేల మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే హెల్త్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ ఈ పథకం కింద 1800ల జబ్బులకు కుటుంబ సభ్యులందరికీ మొత్తం రూ. 5 లక్షల వరకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం లభిస్తుందన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గెల్వయ్య, నర్సింహ, సంతోష్, వెంకులు, దీపక్‌కుమార్ తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

అంబర్‌పేట: సీఎం రిలీఫ్‌ఫండ్ పేద ప్రజలకు వరమని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా అర్హులైన పేదలకు మంజూరైన చెక్కులను శుక్రవారం గోల్నాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్య పరిస్థితుల్లో సీఎం కేసీఆర్ తోడుగా నిలిచి ఉన్నారని, వైద్య చికిత్సల కోసం ఆర్థిక సమస్యలు తలెత్తకుండా ఉండాలని అభిప్రాయపడ్డారు. ఎంత ఖర్చయినా లెక్క చేయకుండా సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసీల ద్వారా అందరికీ సాయం అందిస్తున్నామన్నారు. 10 మంది లబ్ధిదారులకు రూ.6,56,000ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.



అనాథపిల్లలను ఆదుకోవడం అభినందనీయం



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: స్వచ్ఛంద సంస్థలు మానవత దృక్పథంతో అనాథ పిల్లలను ఆదుకోవడం అభినందనీయమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలో ఎస్ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు స్కూల్ ఫీజుతో పాటు రేషన్ సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకొచ్చి అనాథల పట్ల సానుకూలంగా స్పందించడం స్ఫూర్తిదాయకమన్నారు. ఇలాంటి వారి అభ్యున్నతికి తమ సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. ఎస్ఆర్‌డీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రతినిధులు శివాణి, లక్ష్మీగణపతి దేవాలయం చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులున్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి



స్నాతకోత్సవ వేడుకలను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి

కాచిగూడ: విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి అన్నారు. శ్రీమతి ఎ.శ్యామలదేవి మహిళా డిగ్రీ కళాశాల స్నాతకోత్సవ వేడుకలను శుక్రవారం బర్కత్‌పురలోని తెలంగాణ యువతి మండలిహాల్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా లింబాద్రి ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అనేక రంగాల్లో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు నైపుణ్యాల పెంపుతో మెరుగైన ఉద్యోగాలతో పాటు ప్రముఖ సంస్థల్లో పనిచేసే అవకాశం లభిస్తుందన్నారు. తెలంగాణ యువతి మండలి ప్రెసిడెంట్ శేషు విఠల్, వైస్ ప్రెసిడెంట్ ఆర్.పద్మజ మల్లికార్జున్, కార్యదర్శి నివేదితకుమార్, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ వసుంధర, ప్రిన్సిపల్ లావణ్య కుమారి, శిరీష, దీప్తినాయక్, లెక్చరర్లు, విద్యార్థులు తదితరులున్నారు.

స్వామినాథన్ మృతి వ్యవసాయ రంగానికి తీరని లోటు



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హరిత విప్లవ పితామహుడు, ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్.స్వామినాథన్ మృతి వ్యవసాయ రంగానికి తీరని లోటని తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి సాగర్ అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రైతు సంఘం ఆధ్వర్యంలో స్వామినాథన్ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సాగర్ మాట్లాడుతూ.. 1960లో అధిక దిగుబడినిచ్చే గోధుమలు, వరి వంగడాలను అభివృద్ధి చేయడంలో స్వామినాథన్ కీలకపాత్ర పోషించారన్నారు. 2004లో రైతు జాతీయ కమీషన్ అధ్యక్షుడిగా స్వామినాథన్ కనీస మద్దతు ధరను అందించాలని ప్రభుత్వానికి సిఫారస్సు చేశారని గుర్తు చేశారు. రైతులకు మద్దతు ధర లభించాలనే విషయంలో ఆయన చేసిన పోరాటం చారిత్రాత్మకమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వారం రోజులపాటు స్వామినాథన్ సంస్మరణ సభలు నిర్వహించాలని తీర్మానించారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జూలకంటి రంగారెడ్డి, నంద్యాల నర్సింహ్మారెడ్డి, ప్రొఫెసర్ అరబండి ప్రసాద్‌రావు, మూడ్ శోభన్‌నాయక్, బొంతల చంద్రారెడ్డి, బొంతురాంబాబు, సోమయ్య తదితరులున్నారు.

నృత్య కళాకారులకు సన్మానం



సన్మానిస్తున్న భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి

నల్లకుంట: గణనాథుల నిమజ్జనాన్ని వీక్షించేందుకు విచ్చేస్తున్న భక్తులకు కనువిందు చేసేందుకు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నల్లకుంట ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఫీవర్ ఆసుపత్రి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. రాత్రి వరకు నృత్యాలతో భక్తులకు కనువిందు చేసిన కళాకాలరులకు జ్ఞాపికలు అందజేసిన సమితి అధ్యక్షుడు సురేష్‌యాదవ్ శాలువాలతో సన్మానించి అభినందించారు.

2న హెచ్‌యూజే ఆందోళన

కాచిగూడ: దేశంలో మీడియా రక్షణ చట్టాన్ని అమలు చేయాలని, మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, అక్రిడేషన్ జర్నలిస్టులకు రైల్వే పాస్‌లను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ.. ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) ఇచ్చిన పిలుపు మేరకు హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో అక్టోబర్ 2వ తేదీన ఉదయం 10 గంటలకు ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ సర్కిల్ వద్ద జర్నలిస్టుల ధర్నా, నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హెచ్‌యూజే ఉపాధ్యక్షుడు పుండరీచారి ప్రకటించారు. శుక్రవారం బర్కత్‌పురలో ఆయన మాట్లాడుతూ.. ఐజేయూ జాతీయ కార్యదర్శి నరేందర్ రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ, ఎం.ఏ.మాజీద్, హెచ్‌యూజే అధ్యక్షుడు శంకర్ గౌడ్, కార్యదర్శి షౌకత్ హమీద్ తదితరులు పాల్గొంటారని సమాచారం. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి జరిగే ఈ ఆందోళనలో జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆరోగ్యకర అలవాట్లతో గుండె పదిలం



డాక్టర్ మనోజ్‌రెడ్డి

కాచిగూడ: ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామంతోనే గుండె పదిలంగా ఉంటుందని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ) మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్‌రెడ్డి అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కాచిగూడలో గుండె సంబంధిత వ్యాధులపై ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. బీపీ, షుగర్, కిడ్నీ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటే గుండెను కాపాడుకోవచ్చన్నారు. నిరుపేదలకు సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలను విజయవంతంగా అందించేందుకు ఆరోగ్య శ్రీ పథకంతో పాటు రాష్ట్రంలో జీవన్‌దాన్ సమర్థవంతంగా అమలౌతుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

సరైన ఆహారం, వ్యాయామంతో గుండె వ్యాధుల నివారణ..

ముషీరాబాద్: ఆహారపు అలవాట్లు, వ్యాయామంతో గుండె వ్యాధులను నివారించవచ్చని ముషీరాబాద్ కేర్ ఆసుపత్రి సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సూర్యప్రకాష్ గుల్లా అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా శుక్రవారం ముషీరాబాద్ కేర్ ఆసుపత్రిలో కేర్ పేషెంట్ కనెక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. మానవ శరీరంలో గుండె ఎంతో ప్రధానమైందని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన జీవన శైలి, పౌష్టికాహారం, వ్యాయామం ద్వారా గుండె వ్యాధులను దూరం చేయవచ్చన్నారు. అవగాహన రాహిత్యం, శారీరక శ్రమ లేకపోవడంతో చిన్న వయస్సులోనే గుండె సంబంధిత వ్యాధుల బారినపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుండె సంబంధిత వ్యాధులతో కేర్ ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకున్న పలువురిని ఘనంగా సన్మానించారు. కేర్‌ఆసుపత్రుల ఉపాధ్యక్షుడు రాజు చౌరే, డాక్టర్ సుజిత్‌కుమార్, డాక్టర్ క్రిష్టఫర్, డాక్టర్ అబ్దుల్ నఫీ, మీడియా సెల్ ఇన్‌చార్జి సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘విరించి’లో వరల్డ్ హార్ట్ డే



బంజారాహిల్స్: విరించి ఆస్పత్రిలో శుక్రవారం వరల్డ్ హార్టడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్న వారితోపాటు, ప్రస్తుతం చికిత్స పొందుతున్న హృద్రోగులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతర వారికి, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆస్పత్రి గ్రూపు వైస్ చైర్మన్ వేదుల సత్యనారాయణ మాట్లాడుతూ... హృద్రోగానికి సంబంధించి ఏర్పడే ఇబ్బందులను సరైన సమయంలో గుర్తించగలిగితే..అది ప్రాణాంతకంగా మారకుండా చూసుకోవచ్చన్నారు. హార్ట్ ఎటాక్‌కు సంబంధించి మన శరీరం ఇచ్చే సంకేతాలను సరైన సమయంలో గుర్తించి వెంటనే నిపుణులైన వైద్యులున్న హాస్పిటల్‌కు రాగలగితే ప్రాణాన్ని కాపాడవచ్చని చెప్పారు. ఈ సంకేతాలపై ప్రజలలో అవగాహన లేదని, దానిని కల్పించడానికే విరించి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఆస్పత్రి సీఈఓ డాక్టర్ సాయి రవిశంకర్ మాట్లాడుతూ... బీపీ, డయాబెటిస్ వంటి జీవన శైలి వ్యాధులు అదుపులో లేక గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయన్నారు. నిరంతరం వ్యాయామం, మంచి ఆరోగ్య అలవాట్లు, ఆరోగ్యకరమైన జీవన శైలితో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రైవేటీకరణను తిప్పికొట్టండి



మాట్లాడుతున్న ఎం.సాయిబాబు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రైల్వే, విద్యుత్‌రంగ ప్రైవేటీకరణ చర్యలను ప్రజల భాగస్వామ్యంతో తిప్పికొట్టాలని సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో ప్రైవేటీకరణ విధానాలను వేగంగా కొనసాగిస్తుందని విమర్శించారు. రైల్వే, విద్యుత్ రంగ సంస్కరణలు ఉద్యోగుల హక్కులకు భంగం కల్గడమే కాకుండా ప్రజా ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలుగుతుందన్నారు. గత తొమ్మిదేళ్లుగా కేంద్రం ప్రైవేటీకరణ చర్యలను ప్రతిఘటిస్తూ.. సీఐటీయూ పోరాటం చేస్తుందన్నారు.

- అక్టోబర్ 1 నుంచి 10వ తేదీ వరకు గ్రామ స్థాయిలో సమావేశాలు, అక్టోబర్ 11 నుంచి 25వ తేదీ వరకు మండలాల్లో సదస్సులు, నవంబర్ 3న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, 9న రైల్వేస్టేషన్లు, విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఎస్.వీరయ్య తదితరులున్నారు.

ట్రాఫిక్ చిక్కుల్లో ట్యాంక్‌బండ్

- శుక్రవారం సాయంత్రం 4 గంటల వరకు కొనసాగిన నిమజ్జనం
- తీవ్ర ఇబ్బందిపడిన వాహనదారులు

ముషీరాబాద్: ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాలు ట్రాఫిక్ చక్ర దిగ్బంధనంలో చిక్కుకున్నాయి. కిలోమీటర్ మేర ప్రయాణానికి గంటల తరబడి సమయం పట్టడంతో వాహనదారులు తీవ్ర అసహనానికి లోనయ్యారు. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో లిబర్టీ, హిమాయత్‌నగర్, నారాయణగూడ, బర్కత్‌పూర, నల్లకుంట, తిలక్‌నగర్, అంబర్‌పేట ఛే నెంబర్ వరకు వినాయక విగ్రహాలతో నిమజ్జనానికి ట్యాంక్‌బండ్ వెళ్లే వాహనాలు వందల సంఖ్యలో బారులుతీరి ఉన్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

- మరోవైపు ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనం పూర్తి చేసుకున్న భారీ టస్కర్ వాహనాలు కవాడిగూడ, ముషీరాబాద్ చౌరస్తా, ఆర్టీసీక్రాస్‌రోడ్స్, చిక్కడపల్లి నుంచి నారాయణగూడ వరకు బారులు తీరాయి. వివిధ పనులపై వెళ్లే వారు తమ వాహనాలతో ఒక్కసారిగా బయటకురావడంతో రోడ్లతో పాటు చిన్నచిన్న గల్లీలు సైతం వాహనాలతో కిక్కిరిసిపోయాయి.
- గురువారం మొత్తం విధులు నిర్వహించిన ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం ఎక్కడా కనిపించకపోవడంతో సాధారణ పౌరులే చాలా చోట్ల ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.
- ఇక దూర ప్రాంతాలైన సికింద్రాబాద్, సెక్రటేరియట్ ఇతర ప్రాంతాలకు షార్ట్ కట్‌లో వెళ్లేందుకు గల్లీలకు వచ్చి ఇరుక్కుపోయి షార్ట్ కట్ మార్గాలు ఉన్నాయా అంటూ అడగడం కనిపించింది. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కూడా బాగ్‌లింగంపల్లి అంబేడ్కర్ కళాశాల వద్ద అరగంట పాటు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడం గమనార్హం.
- గతంలో నిమజ్జనం చివరి రోజు గణపతులను మండపం నుంచి వాహనంలోకి ఎక్కించడం నుంచి ముందుకు నడిపించడం వరకు పుషింగ్ పార్టీలను ఏర్పాటు చేసే వారు. రాత్రి 9 గంటల వరకల్లా గణేష్ విగ్రహాలను వాహనాల్లోకి ఎక్కించి ముందుకు కదిలించే వారు. అలా ఎవరైనా చేయకుంటే పోలీసులే క్రేన్‌లను తీసుకొచ్చి బలవంతంగా వాహనంలోకి ఎక్కించి అనుకున్న సమయానికల్లా తమ తమ పోలీస్‌స్టేషన్ పరిధి నుంచి గణనాథులను నిమజ్జనానికి తరలించేవారు. ఈసారి పోలీసులు ఆ వైపుగా దృష్టి సారించకపోవడం గమనార్హం.
- శుక్రవారం తెల్లవారు జామున 4–5 గంటలకు ఒక్కసారిగా వాహనాలు నిమజ్జనానికి తరలడంతో వందలాదిగా ట్యాంక్‌బండ్‌కు చేరుకున్న వాహనాలు క్యూలో నిలబడి శుక్రవారం సాయంత్రం 4 గంటల వరకు నిమజ్జనాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. భవిష్యత్తులోనైనా పోలీసులు గతంలో మాదిరిగా పుషింగ్ పార్టీలను ఏర్పాటు చేసి త్వరగా నిమజ్జనాలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


సన్మానం



జితేందర్‌రావును అభినందిస్తున్న డీసీపీ గిరిధర్

చిక్కడపల్లి: ప్రముఖ సంఘసేవకుడు, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న తెలంగాణ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ తనుగుల జితేందర్‌రావును మల్కాజిగిరి డీసీపీ గిరిధర్, ప్రముఖ న్యాయవాది రాజేంద్రప్రసాద్‌లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని, రోజూ ప్రజలకు వార్తలను చేరవేస్తున్న జితేందర్‌రావు కృషి అభినందనీయమన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



చిక్కడపల్లి: జీపీ ఆర్ట్స్ కల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాయకుడు శ్రీనివాసనాయుడు నిర్వహణలో శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభలో ‘అజా అయే బహర్ అజా’ శీర్షికన నిర్వహించిన సినీసంగీత విభావరి అలరించింది. గాయనీగాయకులు సినీగీతాలను శ్రవణానందంగా ఆలపించారు. ఈ సందర్భంగా ప్రముఖులకు ఎల్.పీ.రావు, సుతారి కృష్ణ, రాజు, రజనీష్‌యాదవ్, కే.కే.మెహత, వీరేంద్ర , రవికిరణ్, యాదగిరి, ఆనంద్, కండేవాల్, ప్రభాకర్, హరికృష్ణ తదితరులున్నారు.

అంబేడ్కర్ వర్సిటీ ‘ఇన్-హౌస్ సర్టిఫికెట్’ ప్రింటింగ్ ప్రారంభం



ప్రింటింగ్ విభాగాన్ని ప్రారంభిస్తున్న వీసీ సీతారామారావు

బంజారాహిల్స్: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ కె.సీతారామారావు స్మార్ట్ సర్టిఫికెట్ల ఇన్‌హౌస్ ప్రింటింగ్ సదుపాయాన్ని విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సీతారామారావు మాట్లాడుతూ... డిగ్రీ, పీజీ, ఇతర కోర్సుల అన్ని సర్టిఫికెట్‌లను విద్యార్థులకు మరింత వేగంగా జారీ చేయడానికి ఇన్‌హౌస్ ప్రింటింగ్ సదుపాయంలో లేటెస్ట్ టెక్నాలజీ హై స్పీడ్ ప్రింటర్‌ల సహాయంతో ధ్రువపత్రాలు ప్రత్యేక కాగితంపై ముద్రించనున్నారు. ఇలా ప్రింట్ అయిన సర్టిఫికెట్స్ వాటర్ ప్రూఫ్, దీర్ఘకాల మన్నికను కలిగి ఉంటాయన్నారు. డిజిటల్ క్యూఆర్ కోడ్‌తో నకిలీ సర్టిఫికెట్‌ల తయారీని నివారించడానికి ఆన్‌లైన్ ధ్రువీకరణ వ్యవస్థతో సర్టిఫికెట్ భద్రతలను కలిగి ఉంటుందన్నారు. కార్యక్రమానికి విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.వి.ఆర్.ఎస్.రెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పి.వెంకటరమణ, డైరెక్టరేట్ మెటీరియల్స్–పబ్లికేషన్స్ ప్రొఫెసర్ గుంటి రవీందర్, అదనపు కంట్రోలర్లు వీఎం టెక్నాలజీస్, సీఈఓ ఎస్.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సహకారంతో ప్రశాంతంగా నిమజ్జనం



సిబ్బందితో ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజు

అబిడ్స్: అందరు పోలీస్ సిబ్బంది సహకారంతో గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా కొనసాగిందని అబిడ్స్ డివిజన్ ఏసీపీ ఆకుల చంద్రశేఖర్ పేర్కొన్నారు. అబిడ్స్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజుతో కలిసి సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ చంద్రశేఖర్ మాట్లాడుతూ..72 గంటలకు పైగా నిరంతరం పోలీస్ సిబ్బంది విజయవంతంగా విధులు నిర్వహించారన్నారు. కమిషనర్ సీవీ ఆనంద్, డీసీపీ వెంకటేశ్వర్లు కూడా సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారన్నారు. సిబ్బంది అంతా కలిసికట్టుగా విధులు నిర్వహించి గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా, విజయవంతంగా చేపట్టారని కొనియాడారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజు, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ నర్సింహా, ఎస్ఐలు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మరదలిపై అసభ్య ప్రచారం చేసిన వ్యక్తికి జైలు

సంతోష్‌నగర్: మరదలిపై అసభ్య ప్రచారం చేస్తున్న ఓ వ్యక్తికి నాంపల్లిలోని 7వ స్పెషల్ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు 6 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..మయన్మార్‌కు చెందిన మహ్మద్ హరూన్ 12 ఏళ్ల క్రితం కుటుంబంతో నగరానికి వలస వచ్చి కంచన్‌బాగ్ స్టేషన్ పరిధిలోని హఫీజ్‌బాబానగర్ సీ–బ్లాక్ ప్రాంతంలో ఉంటున్నాడు. హరూన్‌తో పాటు అతని అన్న మహమ్మద్ ఆలం (53) ముగ్గురు భార్యల్లోని చిన్న భార్య సాబు సహార్‌తో నివాసముంటున్నారు. కాగా ఇంట్లో సాబు సహార్ హరూన్ భార్య తరుచూ గొడవపడేది. ఇందులో భాగంగా మహ్మద్ ఆలం హరూన్ భార్య (మరదలు) గుణం బాగాలేదని స్థానికంగా ప్రచారం చేశాడు. దీనిపై హరూన్ తన అన్న మహ్మద్ ఆలంపై కంచన్‌బాగ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు మహ్మద్ ఆలంను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసుకొని శుక్రవారం నాంపల్లిలోని 7వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టులో హాజరు పరచగా..మెజిస్ట్రేట్ ఆలంకు 6 రోజుల జైలు శిక్ష విధిసూ తీర్పునిచ్చారు.

6న ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఆత్మీయ సమ్మేళనం



గడ్డం శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్: అక్టోబర్ 6న ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో భారీ ఎత్తున ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నగర గ్రంథాలయ మాజీ చైర్మన్, గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం గడ్డం శ్రీనివాస్‌యాదవ్ మీడియాతో మాట్లాడుతూ.. దళితవాడలలో నిద్ర, జాబ్ మేళా, ఉచిత డిగ్రీ సీట్లు ఇవ్వడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్నట్లు ఆయన వివరించారు. బీఆర్ఎస్ అధిష్టానం టికెట్ ఇస్తే బీజేపీని ఓడించి బంగారు పల్లెంలో పెట్టి కానుగా ఇస్తానని ఆయన అన్నారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనంలో దాదాపు 10 వేల మంది వస్తారని, వారందరికీ వరల్డ్ ఫేమస్ ప్యారడైజ్ బిర్యాని ఏర్పాటు చేయిస్తున్నట్లు గడ్డం శ్రీనివాస్ యాదవ్ వివరించారు.